క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగించుకోవాలి



డోర్నకల్: ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు కోరారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండలంలోని తహసీల్దార్ బంజర, అమ్మపాలెం, రాజుతండా, ఉయ్యాలవాడ గ్రామాల్లో ఆదివారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొందెకోల వీరమల్లమ్మ (106) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రంజాన్ సంతోషంగా జరుపుకోవాలి



డోర్నకల్: ముస్లిం సోదరులంతా రంజాన్ పండగను సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు మాలోత్ నెహ్రూ నాయక్ కోరారు. స్థానిక ఉస్మానియా మసీదులో ఆదివారం ఇఫ్తార్ విందు జరుగుతున్న సమయంలో ముస్లింలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్ సతీమణి జ్యోతి చైన్ శస్త్ర చికిత్స చేయించుకోగా ఆమెను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జగదీష్, సుమేర్‌చంద్‌జైన్, లాలూనాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు



నెల్లికుదురు: మండలంలోని వావిలాల గ్రామంలో గౌడన్నల కులదైవమైన నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యపాల్‌రెడ్డి, అశోక్, లక్ష్మారెడ్డి, ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.

గుడుంబా నిర్మూలనే లక్ష్యంగా..



దంతాలపల్లి: గుడుంబా నిర్మూలనే లక్ష్యంగా యువకులు రాస్తారోకో చేపట్టిన సంఘటన మండల పరిధిలోని ఆదివారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్తే.. మండలంలోని బీరిశెట్టిగూడెం శివారు వాల్యాతండా గ్రామపంచాయితీకి చెందిన 8 మంది యువకులు తండాలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో దొరికిన 10లీటర్ల గుడుంబాను రోడ్డుపై పెట్టి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సిబ్బందితో తండాకు చేరుకున్న ఎస్సై కరుణాకర్ గుడుంబా తయారు చేస్తున్న బానోత్ వీరన్నపై కేసు నమోదు చేశాడు. యువకులను ఎస్సై అభినందించాడు. కార్యక్రమంలో యువకులు రమేష్, కృష్ణ, వెంకన్న, రమేష్, బాబు, రవి, బి.వెంకన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రం శివారులోని అనంతాద్రి దేవాలయ సమీపంలోగల విఘ్నేశ్వర సహిత అష్టలక్ష్మి అమ్మవారి దేవాలయంలో ఆదివారం చండీహోమం పూజా కార్యక్రమాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, డాక్టర్ సీతామహాలక్ష్మి, పర్కాల శ్రీనివాసరెడ్డి, నూకల నరేష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, తదితరులు హాజరై పూజలు చేశారు.

'ఉపాధి హామీ'లో ఆదర్శం

- దొంక బాట.. మట్టి రోడ్డుగా నిర్మాణం
- ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం
- తొలగిన రైతుల ఇబ్బందులు

పెద్దవంగర: చిన్నవంగర గ్రామం.. ఇది పెద్దవంగర మండలానికి కూతవేటు దూరంలో ఉన్న ఓ పల్లె. ఈ గ్రామంలో చాలా మంది ప్రజల జీవనాధారం వ్యవసాయం. వ్యవసాయ పనులు పూర్తి అయిన తర్వాత అంటే వేసవి కాలంలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతుంటాయి. పంట పొలాలను చదును చేయడం, చెరువులు, కుంటల్లో పూడికలు తీయించడం, వ్యవసాయ క్షేత్రాలకు దారులు వేయడం వంటి తదితర పనులు కల్పిస్తున్నారు. ఏదో పనికి వెళ్లామా.. వచ్చామా.. అని కాకుండా ఉపాధి హామీ కూలీలకు వందశాతం పనులు కల్పిస్తూ నలుగురు మెచ్చేలా చేయిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు.

పెద్దవంగర మండలంలోని చిన్నవంగర గ్రామంలో 653 కుటుంబాలు, 2,183 జనాభా ఉండగా వీరిలో 512 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 286 ఆక్టివ్ కార్డులు ఉన్నాయి. కాగా 495మంది కూలీలు ఏటా పనికి వెళ్తారు. రోజుకు 150నుంచి 200 వరకు గ్రామంలో పొదలను తొలగించడం, చెరువులో పూడికతీత, కందకాలు, గుంతల తవ్వకాలు, తదితరులు పనులు చేపడుతున్నారు.

నెరవేరిన యాభై ఏళ్ల కల

చిన్నవంగర గ్రామ శివారులోని చెరువు అవతల నుంచి ఎస్సారెస్పీ కెనాల్ మీదుగా ఉప్పరగూడెం, పెద్దవంగర, పటేల్‌గూడెం గ్రామాలకు వెళ్లే డొంక దారి ఉంది. ఈదారి వెంట ఇరువైపులు 200 ఎకరాలల్లో రైతులు వ్యవసాయం చేస్తూ వరి, మొక్కజొన్న, మిర్చి, పత్తి పంటలతోపాటు మామిడి వంటి పండ్లతోటలు సాగు చేస్తున్నారు. మట్టిదారి కావడంతో ముళ్లపొదలు ఏపుగా పెరిగి వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈఏడాది ఉపాధిహామీ పనులు మొదలు కావడంతో ఫీల్డ్ అసిస్టెంట్ ఉపేందర్, టీఏ యాకయ్యలు గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీడీఓ వేణుమాధవ్ ఆ ప్రాంతంలో పనులు చేపట్టేలా ఆదేశాలు జారీ చేశారు. దీంతో దారికి ముళ్లపొదలను తొలగించి, గుంతలు పూడ్చారు. కంపచెట్లతో ఉన్న డొంకకు ఉపాధిహామీ పనులతో మట్టి రోడ్డు వేయించి, యాభై ఏళ్ల ప్రజల కళ వారి చొరవతో నెరవేరింది. సుమారు 1.25కిలోమీటర్ల మట్టి రోడ్డు వేశారు. దీంతో గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చిన్నవంగరలో డొంక బాటకు ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రూ.10లక్షలతో రోడ్డు పనులు



మట్టి రోడ్డు నిర్మాణంతో ఇబ్బందులు తొలగాయి. గ్రామంలోని రైతులు వ్యవసాయ పనులకు వెళ్లాలంటే కంపపొదలతో బురదమయంగా ఉన్న డొంకా బాటతో ఇబ్బందులు పడేవారు. రూ.10లక్షల ఈజీఎస్ నిధులతో డొంకను మట్టిరోడ్డుగా ఏర్పాటు చేశాం. మట్టిపై మొరం పోస్తే అక్కడి రైతులకు ఇబ్బందులు ఉండవు. దీంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

- బోయిని ఉపేందర్, ఫీల్డ్‌అసిస్టెంట్, చిన్నవంగర

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పనులనుపై కూలీలకు అవగాహన కల్పించాం. మండల వ్యాప్తంగా రూ.12కోట్లు అంచనా వేసి కూలీలకు తగిన రోజువారి పనులు కల్పించడంతో గతంలో కన్న కూలీల సంఖ్య పెరిగింది. వేసవిలో వ్యవసాయ పనులు అంతగా లేకపోవడంతో పురుషులు, మహిళలు పనులకు వస్తున్నారు. జాబ్‌కార్డు ఉన్న వారు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి.

- వేణుమాధవ్, ఎంపీడీఓ, పెద్దవంగర

ఘనంగా ఈస్టర్ వేడుకలు



కేసముద్రం: వేడుకల్లో పాల్గొన్న క్రిస్టియన్లు



తొర్రూరు: కేక్ కట్ చేస్తున్న ఫాదర్, స్థానికులు



డోర్నకల్: ఎఫిఫనీ చర్చిలో వేడుకలు

కేసముద్రం: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌లో గల ఆగాపే ఫుల్ గాస్పల్ చర్చిలో ఈస్టర్ పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పాస్టర్స్ అండ్ లే లీడర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పిల్లి కుమారస్వామి మాట్లాడుతూ.. మానవాళి రక్షణ కోసం ఏసుక్రీస్తు శుక్రవారం రోజు సిలువపై తన విలువైన రక్తాన్ని చిందించి, మరణించడంతో సమాధి చేశారన్నారు. తను చెప్పిన విధంగా మూడో రోజు ఆదివారం మృత్యుంజయుడిగా ఏసు లేచాడన్నారు. ఇందుకు ఈస్టర్ సండేగా జరుపుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జోలి రాములు, చేతి సతీష్, సంతోష్, నర్సింహారెడ్డి, యాకయ్య, యాకాంబ్రం, ప్రశాంత్, అంజయ్య, వెంకటేశ్వర్లు, సారయ్య, బనిషెట్టి విజయ, సరిత, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: పట్టణంలోని పలు చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మత పెద్దలు ప్రత్యేక ఈస్టర్ ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారు. బిలీవర్స్ ఈస్టన్ చర్చిలో రెవరెండ్ ఫాదర్ నిరీక్షణరావు ఎస్టేర్ క్రీస్తు సందేశాన్ని, ఏసు పునరుత్థాన దర్శన భాగ్యం అనే అంశాన్ని బోధించారు.

డోర్నకల్: స్థానిక ఎఫిఫనీ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎఫిఫనీ, ఆర్సీఎం చర్చిల తోపాటు పలు చర్చిలల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

26ఫీట్ల కాల్వను.. 3ఫీట్లు చేశారు..



కాల్వను కొలుస్తున్న సీపీఐ నాయకులు

మహబూబాబాద్: 26 ఫీట్ల ఎస్సారెస్పీ కాల్వను 3ఫీట్ల కాల్వగా మార్చిన వారిపై చర్య తీసుకోవాలని సీపీఐ మున్సిపల్‌ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం శివారు మెడికల్ కాలేజీ ప్రధాన రోడ్డులో కాల్వను ఆదివారం సీపీఐ నాయకులు సందర్శించి టేపుతో కొలిచారు. ఈసందర్భంగా అజయ్‌సారథి రెడ్డి మాట్లాడుతూ.. ఎవరి ప్రయోజనాల కోసం చేశారో.. అనుమతి ఎవరు ఇచ్చారో అన్ని విషయాలపై ఎస్సారెస్పీ అధికారులు విచారణ చేసి స్పష్టత ఇవ్వాలన్నారు. కాల్వను డ్రెయినేజీగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీ పరిసర ప్రాంతాలలో గల బీఆర్ఎస్ నాయకుల భూముల కోసమే కాల్వను మూడు ఫీట్లు చేశారన్నారు. కాల్వను తొలగించి 3ఫీట్లు చేయడంతో పోతిరెడ్డి కుంట, దామెర కుంట చెరువులకు నీటి సరఫరా ఎలా చేస్తారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాల్వ కుదింపుతో ఈ రోడ్డులోని భూ యాజమానులకు భూమి పెరిగిందని, దాంతో వారికి లక్షల్లో లాభం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, శ్రావణ్, పాల్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

మానుకోటలో ఉజ్జీవ సభలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 8,9,10,11 తేదీల్లో ఉజ్జీవ సభలు జరుగుతాయని ప్రోగ్రాం కన్వీనర్ పాస్టర్ లివింగ్ వాటర్ అన్నారు. సభల పోస్టర్లను జిల్లా కేంద్రంలో దైవ సేవకులు రెవరెండ్ రమేష్ బాబు చర్చిలో ఆదివారం ఆవిష్కరించారు. సభలకు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

స్వామి వారి ఊరేగింపు

డోర్నకల్: మండలంలోని అమ్మపాలెం గ్రామంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి, గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఊరేగింపు వైభవంగా జరిగింది. గార్ల ఆలయం నుంచి నాలుగు రోజుల క్రితం అమ్మపాలెం గ్రామానికి తరలివచ్చిన స్వామికి ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. చివరి రోజు వీధుల్లో ఊరేగించి గార్ల వేంకటేశ్వరస్వామి ఆలయానికి తరలించారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



పట్టుకున్న బెల్లంపానకం, గుడుంబా చూపిస్తున్న పోలీసులు

కురవి: మండలంలోని నేరడ శివారు కాకులబోడు తండా జీపీలో కురవి ఎస్సై గోపి ఆధ్వర్యంలో ఆదివారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. బెల్లం పానకం, గుడుంబాను ధ్వంసం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

గార్ల: మండలంలోని సేరిపురం గ్రామంలో గూగులోతు హమాలి ఇంట్లో అక్రమంగా గుడుంబా అమ్ముతుండగా పోలీసులు దాడి చేసి 7లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ ఆదివారం వెల్లడించారు.

మోదీ సర్కారును ఇంటికి పంపాలి



అభివాదం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గద్దెదించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని వికాస్ డిగ్రీ కళాశాలలో ఆదివారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్లమెంట్ అభ్యర్థి ప్రకటన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ సర్కార్‌ను ఇంటికి సాగనంపాలన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నుంచి మోకాళ్ల మురళీకృష్ణను పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటిస్తున్నామన్నారు. మురళీకృష్ణను గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు గౌని ఐలయ్య, జడ సత్యనారాయణ, బండారి ఐలయ్య, శివ్వారపు శ్రీధర్, మండల వెంకన్న, ఇండంపాక శ్రీశైలం, హెచ్.లింగయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, గుగులోత్ సక్రు, బాబు పాల్గొన్నారు.

గ్రామానికి బెంచీల వితరణ



బెంచీలు బహూకరిస్తున్న హెచ్ఎం

మహబూబాబాద్ రూరల్: మాధవాపురం మాజీ సర్పంచ్, ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత ఇస్లావత్ ధూప్ సింగ్ జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు ఇస్లావత్ లచ్చిరాం ఆదివారం 10 కుర్చీలను బహూకరించాడు. మండలంలోని ఇస్లావత్ తండా (ఎం) గ్రామంలోని వివిధ కూడళ్లలో వాటిని ఏర్పాటు చేశారు. తండ్రి జ్ఞాపకార్థం బెంచీల బహూకరణ చేసి సేవా గుణం చాటుకున్న లచ్చిరాంను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకన్న, నాయకులు బోడ కృష్ణ నాయక్, ఇస్లావత్ రవినాయక్, శంకర్ నాయక్, భావుసింగ్ నాయక్, రవి పాల్గొన్నారు

ఎండిన వరి పంట పరిశీలన



ఎండిన వరిపొలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కురవి: ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం 'సాక్షి'లో ' నీరులేక.. మేతగా మారే..! కథనంతో సీపీఐ నాయకులు మండల కేంద్రం శివారు లచ్చిరాం తండా సమీపంలో ఎండిపోయిన వరిపొలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులు, కుంటలు, బావుల్లో జలాలు అడుగంటి పోవడంతో రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఎస్సారెస్పీ జలాలను విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రమేష్, రాజన్న పాల్గొన్నారు.

'నిందితులను కఠినంగా శిక్షించాలి'



మాట్లాడుతున్న శ్రీశైలం

కొత్తగూడ: దళిత యువకుడిని చితకబాదిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి శ్రీశైలం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. చోరీకి పాల్పడ్డారనే కారణంతో అమానుషంగా చిత్రహింసలకు గురి చేయడం సరైందికాదన్నారు. దాడికి పాల్పడిన అశోక్, హరీశ్, నాగరాజుతోపాటు మరో ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరారు. ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా శిక్షపడేలా పోలీసు అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మంగన్న, యుగేందర్, వెంకన్న, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

గూడూరు: మండలంలోని అయోధ్యపురంతోపాటు పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే మురళీనాయక్ పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు వెంకన్న, ముక్తేశ్వర్ గౌడ్, రమేష్, ఎంపీటీసీ స్వామి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కురవి: నేడు(సోమవారం) కురవి, తిర్మలాపురం, రామచంద్రాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శారద ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వ్యవసాయ ఫీడర్ 11కేవీలో చెట్లు తొలగించే కార్యక్రమం ఉండడం వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

7న ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్: సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ప్రవేశ పరీక్ష ఈనెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు టీటీడబ్ల్యూఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఏవీ రాజ్యలక్ష్మి ఆదివారం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు ఆరో తరగతికి పరీక్ష ఉంటుందని, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం వారి ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

సన్మానం

గార్ల: గార్లలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేసి ఆదివారం పదవీ విరమణ పొందిన కొమ్రరాజు భద్రమ్మను పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్, డైరెక్టర్లు శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, రామారావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డోర్నకల్: డోర్నకల్ సమీపంలో మున్నేరువాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు డోర్నకల్ ఎస్సై తిరుపతి ఆదివారం తెలిపారు. ట్రాక్టరును సీజ్ చేసి ట్రాక్టర్ యజమాని సైదులు, డ్రైవర్ రజినికాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

నెహ్రూసెంటర్: పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి సహజమేనని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్, వరంగల్ డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్ అన్నారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఉద్యోగులు పి.లక్ష్మయ్య, బీ.ఎస్ రావు, స్వర్ణలత ఇటీవల రిటైర్మెంట్ అయ్యారు. కాగా ఆదివారం డిపో ఆవరణలో వారికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్, ఎస్టీఐ వెంకన్న, ఏఎంఎఫ్ పాపిరెడ్డి, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



చిన్నగూడూరు: చిన్నగూడూరు మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా సీనియర్ పాత్రికేయుడు గాడిపెల్లి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శ్రీపాల్, సతీష్, ప్రవీణ్, అనిల్, సాంబయ్య, నరేష్, నరేందర్, కాషయ్య, శ్రీను, చందులాల్, మహేష్, శ్రీను పాల్గొన్నారు.

సందేహాలను నివృత్తి చేయాలి

దంతాలపల్లి: ఉపాధ్యాయులకు టెట్‌పై ఉన్న సందేహాలను రాష్ట్ర విద్యాశాఖ నివృత్తి చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కొండ యాకన్న, కొమ్మనబోయిన వంశీకృష్ణ ఆదివారం కోరారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

కొత్తగూడ: మండలంలోని చెరువుముందు తండాలో మిషన్ భగీరథ నీటి సరఫరా చేసే పైపులైన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు రంధ్రం చేయడంతో భగీరథ నీరు లీకై వృథాగా పోతుంది. ఆదివారం గమనించిన స్థానికులు గ్రిడ్ అధికారులకు సమాచారం అందించడంతో అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేసి పునరుద్ధరించారు.

బియ్యం అందజేత

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ శివారు చైతన్యనగర్ కాలనీకి చెందిన శోభ అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆదివారం సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 50కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారులు సామల నర్సయ్య, రాజా, వీరేందర్, కత్తెరశాల శ్రీను, మాసాడి శ్రీను, ఎన్నమాల మహేందర్, రమేష్, రవి పాల్గొన్నారు.

ముళ్ల చెట్ల తొలగింపు

దంతాలపల్లి: మండలం వాల్యాతండా గ్రామపంచాయితీ సింగితండా చెరువుగట్టుపై జేసీబీతో ఆదివారం ఎస్సై కరుణాకర్ ముళ్ల చెట్లను తొలిగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు గట్టుపై ఇటీవల ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదాలు జరగకుండా కట్టపై ముళ్ల చెట్లు తొలగించామని తెలిపారు.

విజయవంతం చేయాలి

పెద్దవంగర: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమకొండలోని కేఎల్ఎన్ చింతగుట్ట ఫంక్షన్‌హాల్ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన సన్నాహక సమావేశానికి మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ అధ్యక్షులు, సోషల్ మీడియా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రయ్య శర్మ, సంజయ్, శ్రీనివాస్, వెంకన్న, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

డోర్నకల్: డోర్నకల్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు డోర్నకల్ జీఆర్పీ ఎస్సై జె.సురేష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డోర్నకల్ రైల్వే స్టేషన్ సమీపంలో డౌన్‌లైన్ కిలోమీటర్ నంబర్ 463/28–30 వద్ద సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారం లభించలేదన్నారు. మృతుడు గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉండవచ్చని ఎస్సై తెలిపారు. అన్నం సేవా ఫౌండేషన్ ప్రతినిధి అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 58600 నంబర్‌కు సంప్రదించాలని ఎస్సై సూచించారు.

నాసిరకంగా సీసీ రోడ్ల నిర్మాణం

కొత్తగూడ: ఏజెన్సీ మండలంలో సీసీ రోడ్ల నిర్మాణాలు నాసిరకంగా చేపడుతున్నారని తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి ఆరోపించారు. ఈమేరకు మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క కొత్తగూడ, గంగారం మండలాల అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేసిందన్నారు. అట్టి పనులను కాంట్రాక్టర్లు అధికారులతో కుమ్మక్కై నాసిరకంగా చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్య తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ నాయకులు నర్సింగరావు, లక్ష్మీనారాయణ, అశోక్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్గపోరు

బయ్యారం: అధికార కాంగ్రెస్ పార్టీలో కొన్ని నెలలుగా కొనసాగుతున్న వర్గపోరు మామిడితోట సాక్షిగా రచ్చకెక్కింది. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచనల మేరకు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం సమన్వయ కమిటీని ఎన్నుకునేందుకు ఆదివారం బయ్యారం సమీపంలోని ఓ మామిడితోటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పాత, కొత్త నాయకులు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ వాదనలకు దిగినట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసే సమన్వయ కమిటీలో రెండు వర్గాలుగా విడిపోయిన నాయకులు తమ అనుచరుల పేర్లు ఉండేలా చేసిన ఎత్తుగడలపై జరిగిన వాదనలు ఉద్రిక్తతకు దారి తీసినట్లు తెలిసింది. నాయకుల మధ్య ఏకాభిప్రాయం రాకపోవటంతో సమావేశాన్ని మరోసారి ఏర్పాటు చేసుకుందామని నాయకత్వం తెలిపి వెళ్లిపోయినట్లు కాంగ్రెస్ శ్రేణులు తెలిపారు.